లోకం పోకడ

మైనారిటీలకు కాంగ్రెస్ దగా

- రేవంత్ కోసం షబ్బీర్ మార్పు
- కామారెడ్డికి బదులు నిజామాబాద్ అర్బన్
- 'హస్తం' పార్టీపై వెల్లువెత్తుతున్న విమర్శలు

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): అప్పుడే మైనారిటీలకు కాంగ్రెస్ దగా చేసింది. కాంగ్రెస్‌లో సీనియర్ నేత షబ్బీర్ అలీ.. జాతీయస్థాయిలో మంచి పట్టున్న నేతగా పేరుపొందారు. 2004లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో పొత్తుపెట్టుకోవటానికి అప్పటి ఏఐసీసీలో ముఖ్య నేత గులాం నబీ ఆజాద్‌తో సత్సంబంధాలున్న షబ్బీర్ కీలక పాత్ర పోషించారు. తాను కామారెడ్డి నుంచే పోటీచేస్తానని, అక్కడే తనకు పట్టుందని, సీఎం కేసీఆర్‌పై పోటీచేసి ఓడిపోయినా పర్వాలేదు, కానీ మరోచోటి నుంచి తాను పోటీ చేయనని షబ్బీర్ అలీ మొదటి నుంచి చెప్తూ వస్తున్నారు. అయినా, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన ప్రాపకం కోసం సీఎం కేసీఆర్ మీద పోటీ చేయాలనే ఉబలాటంలో షబ్బీర్ అలీని నిజామాబాద్ అర్బన్ నుంచి బరిలో దిగాలని పట్టుబట్టి తన పంతాన్ని నెగ్గించుకొన్నారు. దీంతో షబ్బీర్ అలీ.. తనను సొంత నియోజకవర్గం కాదని ఇతర నియోజకవర్గానికి పంపారని కాంగ్రెస్ అధిష్ఠానంపై గుర్రుగా ఉన్నట్టు సమాచారం. మొత్తం మీద రేవంత్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీకి మైనారిటీలను దూరం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రేవంత్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ కంటతడి పెడుతున్న ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్

ఉమ్మడి ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ ఖాళీ

- ఒకేరోజు సాజిద్‌ఖాన్, సుజాత, సంజీవ్‌రెడ్డి రాజీనామా
- చెన్నూర్‌లో మాజీ మంత్రి బోడ జనార్దన్, డాక్టర్ రాజా రమేశ్ గుడ్‌బై
- ముథోల్‌లో పార్టీకి రాజీనామా చేసిన కిరణ్ కొమ్రేవార్
- ఆశావహుల రాజీనామాతో హస్తంపార్టీలో కలవరం

మంచిర్యాల, నవంబర్ 6(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో హస్తం పార్టీ ఖాళీ అయింది. టికెట్ ఆశించిన వారికి పార్టీ రిక్తహస్తం చూపించడంతో ఉడికిపోతున్న నేతలు పార్టీకి గుడ్‌బై చెప్పేస్తున్నారు. నేతల రాజీనామాలతో ఒక్క రోజులోనే ఉమ్మడి ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ ఖాళీ అయింది. పీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ మంత్రి రాంచందర్‌రెడ్డి మేనల్లుడు సంజీవ్‌రెడ్డి సోమవారం మూకుమ్మడిగా రాజీనామాలు చేసి పార్టీకి షాకిచ్చారు. తమతో వెట్టిచాకిరీ చేయించుకుని, టికెట్ అడిగితే ఇవ్వకుండా అమ్ముకున్నారని, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నమ్మకద్రోహి అని, తమకు వెన్నుపోటు పొడిచాడని వాపోయారు.

సాజిద్‌ఖాన్ కంటతడి

డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ కంటతడి పెట్టుకున్నారు. నమ్ముకున్న కాంగ్రెస్ తనకు తీరని అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏండ్లుగా పార్టీ కోసం పని చేస్తున్నా గుర్తింపు లేకుండా పోయిందని ఉద్వేగానికి గురయ్యారు. కాంగ్రెస్ మొదటి సభను మంచిర్యాలలో పెడదామంటే ప్రేమ్‌సాగర్ రావు, నిర్మల్‌లో పెడదామంటే మహేశ్వర్‌రెడ్డి ఒప్పుకోకపోవడంతో ఇంద్రవెల్లిలో మొదటి సభ నిర్వహించేలా చేస్తే రేవంత్‌రెడ్డి అవన్నీ మర్చిపోయారని విమర్శించారు. ఆరెస్సెస్ భావజాలం ఉండి, బీజేపీ నుంచి వచ్చిన కంది శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఇచ్చారని పేర్కొన్నారు. ప్యారాచూట్ నాయకులకు కాకుండా తమ ముగ్గురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పనిచేసి ఉండేవాళ్లమని చెప్పారు. కాంగ్రెస్ రెబల్‌గా సంజీవ్ రెడ్డి బరిలో ఉంటారని, నియోజకవర్గంలో పార్టీని ఓడించి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

నిర్మల్ జిల్లాలో కిరణ్ కొమ్రేవార్

నిర్మల్ జిల్లా ముథోల్ టికెట్‌ను ఆశించిన కిరణ్ కొమ్రేవార్ కూడా కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పేశారు. తనకే టికెట్ ఇస్తామని రేవంత్ చెప్పారని, ఇప్పుడేమో అసలు దరఖాస్తే చేసుకోని నారాయణరావు పటేల్‌కు టికెట్ ఎలా ఇస్తారని నిలదీశారు. అన్యాయం చేసిన పార్టీలో ఉండలేకే రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న వేళ కాంగ్రెస్‌లోని తాజా పరిణామాలు పార్టీశ్రేణులను అయోమయానికి గురిచేస్తున్నాయి. పార్టీలో ఉండేదెవరో? బయటకు వెళ్లేదెవరో తెలియక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. బోడ జనార్దన్ బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు ప్రకటించగా, డాక్టర్ రాజారమేశ్ కూడా కారెక్కబోతున్నట్టు ప్రెస్‌మీట్‌లో తెలిపారు.

అటు డాక్టర్ రాజారమేశ్.. ఇటు బోడ జనార్దన్

మంచిర్యాల జిల్లా చెన్నూరు టికెట్‌ను గడ్డం వివేక్‌కు ఇవ్వడంపై కాంగ్రెస్ సీనియర్ నాయకులు భగ్గుమన్నారు. వివేక్‌కు టికెట్ ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆదివారం డాక్టర్ రాజారమేశ్ పార్టీకి రాజీనామా చేసి కలకలం రేపారు. వైద్య వృత్తిని వదులుకుని పార్టీలో చేరిన తనకు టికెట్ ఇస్తామని నమ్మించి మోసం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్టు మాజీ మంత్రి బోడ జనార్దన్ సోమవారం ప్రకటించారు. పార్టీ చెప్పేదొకటి, చేసేదొకటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో కనీసం మూడేళ్లుగా ఉన్న వారికే టికెట్ ఇస్తామని చెప్పి ఇప్పుడు బీజేపీ నుంచి వచ్చిన వివేక్‌కు టికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకే రాజీనామా చేశానని, వివేక్‌ను ఓడించి ఇంటికి పంపిస్తామని హెచ్చరించారు.

ద్రోహుల 'చేతు'ల్లోకి తెలంగాణ వద్దు

- కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయం
- రేవంత్, ఉత్తమ్ మాటమీద నిలబడరు
- ప్రజలు ఆలోచించి ఓటియ్యాలి: హరీశ్‌రావు
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నగేశ్ ముదిరాజ్

కాంగ్రెస్ నేత నగేశ్ ముదిరాజ్‌ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను ద్రోహుల చేతుల్లో పెట్టొద్దని మంత్రి హరీశ్‌రావు కోరారు. ఫేక్‌గాళ్ల మాటలు నమ్మి రిస్క్‌లో పడొద్దని హితవు పలికారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వద్దనుకొని కాంగ్రెస్‌కు ఓటేసి రిస్క్ తీసుకుందామా? ఎకరానికి ఏడాదికి రూ. 10 వేలు ఇస్తున్న ప్రభుత్వాన్ని వద్దనుకుని కాంగ్రెస్‌కు ఓటేసి రిస్క్ తీసుకుందామా? అని ప్రజలను ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేత నగేశ్ ముదిరాజ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి హరీశ్‌రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ పదేండ్లలో హైదరాబాద్‌లో కర్ఫ్యూ అనేదే లేకుండా ప్రజలు సుఖంగా, సంతోషంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే వారు కుర్చీల కోసం మతకల్లోలాలు సృష్టిస్తే మనకు రిస్క్ కదా అని పేర్కొన్నారు. వాళ్లకు ఓటేసి మన మెందుకు రిస్క్‌లో పడాలని ప్రశ్నించారు. కండ్లతో చూసింది.. చెవులతో విన్నది నమ్మాలని సూచించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, ఇతర పార్టీలు కలిసి పోటీచేస్తే ఈసారి పొత్తులేకుండా పరోక్షంగా కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. రేవంత్, ఉత్తమ్‌కుమార్ మాట మీద నిలబడే వ్యక్తులు కాదని, ఏం చూసి వారికి ఓటియ్యాలని ప్రశ్నించారు. పదేండ్ల ముందు, ఇప్పుడు తెలంగాణ ఎట్లుందనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

పాటలను మార్చి రాస్తున్నారు

అప్పట్లో 'తలాపున పారుతుంది గోదారి.. నీ చేను చెలక ఎడారి' అని, 'పల్లెపల్లెన పల్లేర్లు మొలిచే' అంటూ పాటలు రాసి తెలంగాణ కరువును కవులు కండ్లకు కట్టారని మంత్రి హరీశ్‌రావు గుర్తు చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడ చూసినా పచ్చటి పొలాలు దర్శనమిస్తున్నాయని పేర్కొన్నారు. వీటిని చూసి ఇప్పుడు 'పల్లెపల్లెన పసిడి పంటలు పండె' అని పాటలు మార్చి రాయాల్సి వస్తున్నదని తెలిపారు. గతంలో 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' అని రాశారని.. నేడు ప్రతి నియోజకవర్గంలో 100 పడకల దవాఖాన, ప్రతి జిల్లాకు ఓ మెడికల్ కాలేజీ వచ్చాయని పేర్కొన్నారు. వలసలు తగ్గాయని, ఇపుడు ఇతర రాష్ట్రాల వారే ఇక్కడికి వలస వస్తున్నారని తెలిపారు. పది రాష్ట్రాల కూలీలకు పని కల్పిస్తున్నామని వివరించారు. మళ్లీ వచ్చేది కేసీఆరేనని, కాంగ్రెస్‌కు ఓటేసి ఎందుకు రిస్క్ తీసుకోవాలని ప్రశ్నించారు. హైదరాబాద్ న్యూయార్క్‌లా ఉందని సినిమా హీరో రజనీకాంత్ మెచ్చుకున్నారని, ఇక్కడున్న కాంగ్రెస్ గజనీగాళ్లకు మాత్రం ఇంకా అర్థం కావడం లేదని అన్నారు.

34 ఏండ్లు పనిచేసినా గుర్తింపు రాలే

తాను కాంగ్రెస్‌లో 34 ఏండ్లు పనిచేసినా తగిన గుర్తింపు లభించలేదని నగేశ్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీలకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీలో బీసీలను మనుషులుగా కూడా చూడడం లేదని, పొన్నాల ఏడ్చుకుంటూ పార్టీని వీడారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

కాంగ్రెస్ ఆత్మీయ సమావేశంలో తన్నులాట!

- గల్లాలు పట్టుకొని పిడిగుద్దుల వర్షం
- జారుకున్న మహేశ్ కుమార్, మల్లురవి

సోమవారం కూకట్‌పల్లి ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్‌లో పిడిగుద్దులు కురిపించుకుంటున్న నాయకులు

హైదరాబాద్ సిటీబ్యూరో/కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 6: కాంగ్రెస్‌లో కుమ్ములాటలు ముదిరి పాకానపడుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేశ్‌కు మద్దతుగా సోమవారం కూకట్‌పల్లి ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్‌లో జరిగిన ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో బాలాజీనగర్, బోయిన్‌పల్లి డివిజన్లకు చెందిన నేతలు, కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్, సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి సమక్షంలోనే పొట్టు పొట్టు కొట్టుకున్నారు. గల్లాలు పట్టుకొని పిడిగుద్దులు కురిపించుకోవడంతో కొందరి తలలు పగిలి రక్తం చిందింది. భోజన బల్లలు చెల్లాచెదురయ్యాయి. దీంతో రాష్ట్ర నేతలు అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో కొట్లాటలు మామూలేనని కొందరు నేతలు బహిరంగంగానే వ్యాఖ్యానించారు. స్థానికేతరుడైన బండి రమేశ్‌ను అభ్యర్థిగా ప్రకటించడమే ఈ గొడవలకు కారణమని తెలుస్తున్నది.

మహారాష్ట్రలో గులాబీ జయభేరి

నాడు తెలంగాణలోనూ స్థానిక సంస్థల నుంచే జైత్రయాత్ర

- పంచాయతీ ఉప ఎన్నికల్లో జయకేతనం
- 57 సర్పంచ్ పదవులు బీఆర్ఎస్ కైవసం
- 44% స్థానాల్లో గులాబీ జెండా రెపరెపలు
- 327 వార్డు స్థానాల్లో తిరుగులేని విజయాలు
- మహారాష్ట్రలోనూ కొనసాగుతున్న అదే ఒరవడి

ముంబై, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఆవిర్భవించిన బీఆర్ఎస్ తొలుత స్థానిక సంస్థల ఎన్నికల ద్వారానే విజయయాత్ర ప్రారంభించింది. పార్టీగా ఆవిర్భవించిన అనతికాలంలోనే సంచలన విజయాలను నమోదుచేసిన బీఆర్ఎస్.. అలుపెరగని పోరాటాలతో స్వరాష్ట్రం సాధించింది. పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో రెండు సార్లు అధికారం చేపట్టి, మూడోసారి హ్యాట్రిక్ విజయం సాధించే దిశగా దూసుకెళ్తున్నది. తెలంగాణలో మాదిరిగానే ఇప్పుడు పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలోనూ 'గులాబీ' తుఫాన్ మొదలైంది. బీఆర్ఎస్ మహారాష్ట్రలో అడుగుపెట్టిన కొన్ని నెలలకే జరిగిన సర్పంచ్ ఉప ఎన్నికల్లో సత్తా చాటింది. 130 సర్పంచ్ పదవులకు ఉప ఎన్నికలు జరుగగా.. ఇందులో ఏకంగా 57 పదవులు కైవసం చేసుకున్నది. అంటే 44% స్థానాల్లో గులాబీ జెండా ఎగిరింది. మొత్తంగా 327 వార్డుల్లో గులాబీ జెండా రెపరెపలాడింది. ఈ విజయంతో మహారాష్ట్రలో బీఆర్ఎస్ శకం మొదలైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మహారాష్ట్రలోని 2,359 గ్రామపంచాయతీల్లో ఖాళీగా ఉన్న 130 సర్పంచ్ పదవులకు ఆదివారం ఉప ఎన్నికలు నిర్వహించారు. సోమవారం ఓట్ల లెక్కింపు చేపట్టారు.

- సోలాపూర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత భాగిరథ్ బాల్కే నేతృత్వంలో భండారా జిల్లాలో మొత్తం 27 గ్రామపంచాయతీల్లో పోటీ పడగా ఇందులో 17 సర్పంచ్ పదవులు గెలిచారు. 90 మంది వార్డు మెంబర్లుగా విజయం సాధించారు.
- నాగపూర్ జిల్లాలో సీనియర్ నేత చరణ్‌వాగ్ మారే నేతృత్వంలో తుమసర్ తాలుకాలోని 55 చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు పోటీ చేయగా 25 చోట్ల సర్పంచ్ పదవులు గెలిచారు. 185 మంది వార్డు మెంబర్లుగా విజయం సాధించారు. నాగపూర్ జిల్లాలో డొర్నిముకణే పంచాయతీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ సర్పంచ్ పదవి కైవసం చేసుకోగా, నలుగురు వార్డు మెంబర్లు గెలిచారు. అష్టి గ్రామపంచాయతీలో ఇద్దరు వార్డు మెంబర్లుగా విజయం సాధించారు.
- నాందేడ్ జిల్లా దేగ్లూర్-బిలోలి సమన్వయకర్త రమేశ్ గూళేకర్ నేతృత్వంలో గోగులగోవింద్ తాండా గ్రామపంచాయతీని బీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేసింది. సర్పంచ్ పదవికి అమోల్‌హాన్‌తోపాటు 7 మంది వార్డు మెంబర్లు గెలిచారు.
- కొంకణ్ విభాగ సమన్వయకర్త ప్రొఫెసర్ విజయ్ మొహితె ఆధ్వర్యంలో రాయ్‌ఘడ్ జిల్లా శ్రీవర్ధన్ గ్రామపంచాయతీలో సర్పంచ్ పదవితోపాటు 11 మంది వార్డు మెంబర్లుగా గెలిచారు. ఫేణ్ గ్రామపంచాయతీలో నలుగురు వార్డు మెంబర్లుగా విజయం సాధించారు.
- ఫాల్ఘర్ జిల్లాలో ఛరోటి, దబోన్ గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు సర్పంచ్‌లు ఏకగ్రీవంగా విజయం సాధించారు. 9 మంది వార్డు మెంబర్లుగా విజయం సాధించారు.
- జల్గావ్ జిల్లాలో 8 సర్పంచ్ పదవులు, అహమద్‌నగర్ జిల్లాలో రెండు పదవులు బీఆర్ఎస్ కైవసం చేసుకున్నది.

సీపీఎంతో కటీఫ్ వెనుక రేవంత్ కుట్ర!

- ఖమ్మం, నల్లగొండలో ముఖ్య నేతల ఓటమే లక్ష్యంగా ప్లాన్
- పొత్తుకు భట్టి, జానా పట్టు.. ససేమిరా అంటున్న రేవంత్
- పొత్తులపై సీపీఐతో మాట్లాడిన రేవంత్‌రెడ్డి
- సీపీఎం నాయకత్వంతో మాట్లాడకపోవడంపై అనుమానాలు
- రంగంలోకి సోనియాగాంధీ.. సీపీఎం జాతీయ కార్యదర్శి ఏచూరికి ఫోన్?

హైదరాబాద్, నవంబర్ 6(నమస్తే తెలంగాణ): సీపీఎం, కాంగ్రెస్ మధ్య పొత్తు కుదరకుండా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కుట్ర పన్నారా? ఆయన ఉద్దేశపూర్వకంగానే సీపీఎంతో పొత్తును చెడగొట్టేందుకు పూనుకున్నారా? ఇదే అనుమానం ఇప్పుడు కాంగ్రెస్ శ్రేణులను వెటాండుతున్నది. సీపీఐతో పొత్తు కోసం ఆ పార్టీ ఆఫీసుకు వెళ్లి చర్చలు జరిపిన రేవంత్‌రెడ్డి.. సీపీఎం విషయంలో చొరవచూపకపోవడం అనుమానాలకు బలం చేకూరుస్తున్నది. నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలను ఓడించడమే లక్ష్యంగా సీపీఎంతో పొత్తు కుదరకుండా చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క టార్గెట్‌గా ఈ ప్లాన్‌ను అమలు చేసినట్టు కాంగ్రెస్ నేతలు చర్చించుకుంటున్నారు. భట్టి విక్రమార్క పోటీ చేస్తున్న మధిర నియోజకవర్గం సీపీఎంకు బలమైన కేంద్రం. అందుకే సీపీఎంతో పొత్తుకు భట్టి విక్రమార్క మొదటి నుంచీ గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఆయనతోపాటు మరో సీనియర్ నేత జానారెడ్డి కూడా తనవంతుగా ప్రయత్నం చేశారు. అయితే రేవంత్‌రెడ్డి మాత్రం సీపీఎంతో పొత్తుకు ససేమిరా అన్నట్టు తెలిసింది. సీపీఐతో పొత్తుకు సానుకూలంగా వ్యవహరించిన రేవంత్‌రెడ్డి.. సీపీఎంతో పొత్తుకు ఏ మాత్రం మొగ్గు చూపలేదని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. పార్టీలో తన ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు, ప్రత్యర్థులను దెబ్బ తీసేందుకే ఈ విధమైన కుట్రలకు రేవంత్‌రెడ్డి తెర లేపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రంగంలోకి సోనియాగాంధీ

సీపీఎంతో పొత్తు కోసం కాంగ్రెస్ తరపున స్వయంగా సోనియాగాంధీ రంగంలోకి దిగారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాంఏచూరికి ఆమె ఫోన్ చేశారు. తెలంగాణ ఎన్నికల్లో పొత్తుకు సహకరించాలని, 'ఇండియా' కూటమి లాగే ఐక్యంగా కలిసి పనిచేయాలని కోరారు. దీంతో ఈ విషయంపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకుసీతారాం ఏచూరి ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. కాగా.. సీపీఎం ఇప్పటికే 14 మంది అభ్యర్థులతో మొదటి జాబితాను, సోమవారం మరో రెండు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. హుజూర్‌నగర్ అభ్యర్థిగా మల్లు లక్ష్మి, నల్లగొండ అభ్యర్థిగా ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పోటీ చేస్తారని తెలిపింది. కోదాడ అభ్యర్థిని మంగళవారం ప్రకటిస్తామని, మునుగోడు, ఇల్లందు స్థానాల్లో కూడా పోటీ ఆలోచన ఉన్నదని వీరభద్రం తెలిపారు. ఖమ్మం పార్టీ జిల్లా కార్యాలయంలో తమ్మినేని మీడియాతో మాట్లాడుతూ.. పొత్తులపై కాంగ్రెస్ తమతో సరిగా వ్యవహరించలేదని మండిపడ్డారు. ఖమ్మంలో సీటు ఇవ్వకపోతే పొత్తుకు ఒప్పుకునేది లేదని తమ్మినేని స్పష్టంచేశారు.

ఎట్టకేలకు కాంగ్రెస్, సీపీఐ పొత్తు

కాంగ్రెస్, సీపీఐ మధ్య ఎట్టకేలకు పొత్తు ఖరారైంది. సీపీఐకి కేవలం ఒకే ఒక్క సీటుతో కాంగ్రెస్ సరిపుచ్చింది. కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గాన్ని సీపీఐకి కేటాయించింది. భవిష్యత్తులో రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇచ్చేందుకు ఇరు పార్టీల మధ్య అంగీకారం కుదిరింది. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సీపీఐ నేతలు కే నారాయణ, చాడ వెంకట్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు తదితరులతో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోమవారం పొత్తులపై చర్చించి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ నేత నారాయణ మాట్లాడుతూ.. నెల క్రితం నిశ్చితార్థం అయ్యిందని, ఇప్పుడు పెండ్లి జరిగిందని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో వామపక్షాలకు ప్రాతినిధ్యం, ప్రజాస్వామ్య పరిరక్షణ, సెక్యూలర్ పార్టీల పునరేకీకరణ లక్ష్యంతో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తామని కూనంనేని సాంబశివరావు తెలిపారు.

పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి ఓటు హక్కుపై పిటిషన్

దేవరుప్పుల, నవంబర్ 6: పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్విని ఓటు హక్కుపై ములుగాసి శివకుమార్ హైకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే యశస్విని ఓటుపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు, సంబంధిత జిల్లా అధికారులకు, కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయినా ఏఐసీసీ ఆమెనే పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో సదరు వ్యక్తులు నేరుగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

భీంభరత్‌కు కాంగ్రెస్ బీఫాం నిరాకరణ

హైదరాబాద్, నవంబర్ 6(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థి పామెన భీంభరత్‌కు పార్టీ హ్యాండిచ్చింది. బీఫాం తీసుకునేందుకు సోమవారం గాంధీభవన్‌కు వచ్చిన ఆయనకు బీఫాం ఇవ్వలేమని పార్టీ వర్గాలు తేల్చి చెప్పాయి. చేసేదేమీ లేక ఆయన ఉత్త చేతులతో వెనుదిరిగాల్సి వచ్చింది. తనకు బీఫాం ఇవ్వకపోవడంపై భరత్ మరోలా చెబుతున్నారు. నామినేషన్ వేసేందుకు సాంకేతికంగా పలు ఇబ్బందులు ఉండడంతోనే బీఫాం ఆపేశారని ఆయన పేర్కొన్నారు.

రేవంత్ ఓ దొంగని సుప్రీంకోర్టే చెప్పింది!

- వైఎస్ షర్మిల పరోక్ష వ్యాఖ్యలు

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): వచ్చే ఎన్నికల్లో ఓటుకు నోటు దొంగలకు ఓట్లేయొద్దని వైఎస్సార్టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపునిచ్చారు. సోమవారం లోటస్‌పాండ్‌లో ఆమె మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో దొంగలను తరిమికొట్టాలని, దొంగలను ముఖ్యమంత్రులను చేయొద్దంటూ రేవంత్‌ను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. 'రేవంత్‌ను నేను దొంగ అనడం లేదు. ఓటుకు నోటు కేసులో తనపై ఉన్న కేసును కొట్టివేయాలని ఆయన సుప్రీంకోర్టుకు పోయిండు. ఆ కేసును కొట్టివేయడం కుదరదు. ఆ కేసు ముందుకు సాగాలి. ఆ కేసులో రేవంత్ సహా అందరూ దోషులే.. దొంగలే' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని షర్మిల వివరించారు. ఇటీవల రేవంత్‌రెడ్డిని రేటెంతరెడ్డి అని ముద్దుగా పేరు పెట్టింది తాను కాదని స్పష్టం చేశారు.

బీజేపీ బలంగా లేదు: ఈటల

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీజేపీ బలంగా లేదని స్వయంగా ఆ పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అంగీకరించారు. 119 నియోజకవర్గాలకు సరిపడా నాయకులు, క్యాడర్ లేరని పేర్కొన్నారు. సోమవారం ఆయన 'మీట్ ది ప్రెస్'లో మాట్లాడుతూ.. బీజేపీ తెలంగాణలో ఇంకా స్థిరపడలేదని చెప్పారు. హైదరాబాద్‌తోపాటు నాలుగైదు జిల్లాల్లో మాత్రమే ప్రభావం చూపించగలుగుతుందన్నారు. పార్టీ బలంగా లేని స్థానాలను జనసేనకు ఇచ్చినట్టు చెప్పారు. మ్యానిఫెస్టో ఇంకా తయారవుతూనే ఉన్నదని, ఎప్పుడు విడుదలవుతుందో చెప్పలేమని అన్నారు.

బీజేపీ ప్రచారం నుంచి విజయశాంతి ఔట్

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారానికి మాజీ ఎంపీ విజయశాంతిని బీజేపీ దూరం పెట్టింది. బీజేపీ తాజాగా విడుదల చేసిన స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో విజయశాంతి పేరును చేర్చలేదు. దీంతో ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలుస్తున్నది. ఆమె బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరనున్నారని కొన్నాళ్లుగా ప్రచారం సాగుతున్నది. తాజా పరిణామాల నేపథ్యంలో ఆమె కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమైందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

చిన్నారెడ్డికి మొండి'చెయ్యి'

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన గురువుకే పంగనామాలు పెట్టారు. తొలి జాబితాలో చిన్నారెడ్డికి వనపర్తి నియోజకవర్గం టికెట్ ఇచ్చినట్టే ఇచ్చి ఇప్పుడు మొండి చెయ్యి చూపారు. సోమవారం 16 మంది అభ్యర్థులతో మూడో జాబితాను కాంగ్రెస్ అధిష్ఠానం విడుదల చేసింది. ఇందులో వనపర్తి నియోజకవర్గం నుంచి జిల్లేల చిన్నారెడ్డి పేరును తొలిగించి, తుడి మేఘారెడ్డికి కేటాయించింది. బోథ్ టికెట్‌ను మొదట వెన్నెల అశోక్‌కు కేటాయించగా, తాజాగా ఆ స్థానాన్ని ఆదె గజేందర్‌కు కేటాయించింది. తుంగతుర్తి, సూర్యాపేట, మిర్యాలగూడతో పాటు చార్మినార్ స్థానాలకు అభ్యర్థులకు ప్రకటించకుండా కాంగ్రెస్ పెండింగ్‌లోనే పెట్టింది. చెన్నూరులో నాలుగు రోజుల క్రితం పార్టీలో చేరిన వివేక్‌కు టికెట్ ఇచ్చి స్థానికంగా పార్టీని నమ్ముకుని ఉన్న బోడ జనార్దన్, రాజా